



ఆది ఒక పెద్ద ఆఫీసు, లోపల ఆఫీసర్ రూమ్‌లో ఇంటర్వ్యూ జరుగుతోంది. ఇంటర్వ్యూ చేయబడుతున్న వాడు న్యూటన్‌రాజా "చూడవోయ్ మిస్టర్ రాజా, పిల్లి ఒంటిమీద ఎన్ని వెంట్రుకలుంటాయి" అని అడిగాడు ఆఫీసర ఐన్‌స్టీన్. రాజా గుండు గోక్కున్నాడు. "పోనీ దానితోట్లో వెంట్రుకలు ఎన్నుంటాయో చెప్పగలవా?" అని అడిగాడు ఆఫీసర్ రాజా గుడ్లు మిటకరించాడు. "పోనీ ఇదైనా చెప్పు చూద్దాం, దానితోక పొడవెంత!" అన్నాడు.

రాజా నీరసంగా లేచాడు

"సార్, ఈ ఇంటర్వ్యూ పిల్లి మీద అని తెలిస్తే తప్పక ప్రిపేర్ అయి వచ్చేవాణ్ణండి" అన్నాడు.

"కంగ్రాచ్యులేషన్స్. ఆఖర్లో ఇలా అన్న వారికి ఉద్యోగం ఇమ్మని పైనుంచి ఆర్డర్స్ వచ్చాయి. రేపే జాయినవ్వు నిజంగా నీలాంటి మేధావిని నేను చూడలేదోయ్. ఆ గుండు గోక్కోటం, ఆ గుడ్లు మిటకరించటం, ఆహా రియల్లీ ఫెంటాస్టిక్" అన్నాడు ఆఫీసర్ ఆనందంగా.

"థాంక్యూసర్" అని ఆనందంగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి చేరాడు

ఆ శిధిలావస్థలో ఉన్న పూరి పాకలో నులకమంచంమీద పడుకొని ఖుళ్ళు ఖుళ్ళు దగ్గుతున్న తల్లితో చెప్పాడు తన ఉద్యోగం సంగతి

"పోన్లే బాబూ, ఇప్పటికైనా" అంటూ దగ్గి "అన్నట్లు ఈ పూట బియ్యంలేవని అన్నం వండలేదురా" అంటూ ఇంకా దగ్గసాగింది.

"ఉండమ్మా. మంచినీళ్ళిస్తాను" అంటూ ఫ్రిజ్‌లోంచి ఐస్‌వాటర్ తీసి తాగించాడు.

మర్నాడే ఉద్యోగంలో జాయిన్ అయ్యాడు.

ఒక కిటికీ ప్రక్కనే కూర్చుని రోడ్డుమీద పోయే మనుషులని లెక్కపెడుతూ వాళ్ళబట్టల రంగుని గుర్తించడం అతని మహత్తర బాధ్యతలలో అతి ముఖ్యమైనది నెల అవగానే ఆ సమాచారాన్ని సీల్‌చేసి పోలీస్ సెక్యూరిటీ హెడ్డాఫీసుకి పంపుతారు

అలా రోజులు గడిచాయి.

ఉన్నట్టుండి అతని ప్రతిభకి గుర్తింపొచ్చింది. ఆ సంవత్సరంలో రోడ్డునపోయే మనుషులని అతి ఎక్కువగా లెక్కించినందుకు కంపెనీ అతడిని విజేతగా ప్రకటించి ఒక మోపు కట్టెపుల్లలు, పదకొండు రూపాయలు పదకొండు నయాపైసలు బహుమతి ఇచ్చింది. ఉత్సాహంగా ఇంటికి వచ్చి తల్లికి చూపించాడు రాజా

చూద్దామని పైకిలేచి, అంతలోనే వెనక్కుపడిమరణించింది ఆమహాతల్లి

"అమ్మా! ఆఖరికి బహుమతి వచ్చిన కట్టెలతోనే నిన్ను దహనం చెయ్యాల్సివచ్చిందా?" అంటూ గుండెలు పగిలేలా ఏడ్చాడు

వెంటనే విమానంలో ఢిల్లీవెళ్ళి ప్రధానమంత్రిని పట్టుకొని "ఏమిటీ అన్యాయం" అని నాలుగు దులిపేద్దామనుకున్నాడు. కానీ ఆ సమయంలో విమానం ఏదీ లేనందున ప్రధానమంత్రి బతికిపోయాడు. వెంటనే తల్లిని కారు బాక్ సీటులో పడుకోబెట్టి డ్రైవ్ చేసుకుంటూ శ్మశానానికి తీసుకువెళ్ళాడు.

కాటికాపరి శవాన్ని చూసి "కాల్చటానికి ఏభై రూపాయలవుతుందండి" అన్నాడు.

"బాబూ, కట్టెలు నేనే తెచ్చుకున్నాను. కావాలంటే ఈ పదకొండు రూపాయలూ తీసుకో, ఈ పదకొండు పైసలు కూడా నువ్వే తీసుకో. నాతల్లిని దహనం చేయనివ్వు" అన్నాడు రాజా.

అదేం కుదరదని గదమాయించాడు కాటికాపరి

రాజా ఏడుస్తూ, "చూడవయ్యా చూడు. పుట్టింది మొదలు తన దగ్గుతో కన్నవాళ్ళ ప్రాణాలుతీసేసి కట్టుకున్న వాడికి సుఖం లేకుండా సన్యాసుల్లో కలిసేటట్లు చేసి, చివరికి ఆ పాడు దగ్గుతోనే తన ప్రాణాలు తీసుకున్న ఆ మహాతల్లి ముఖంచూడు" అన్నాడు.

కాటికాపరి వెక్కి వెక్కి ఏడ్చాడు. కుళ్ళికుళ్ళి మరీ ఏడ్చాడు. శ్మసానమంతా పొర్లిపొర్లి ఏడ్చాడు.

ఆఖరికి లేచి "బాబూ, నన్ను క్షమించండి. ఆ పదకొండు రూపాయలు ఇవ్వండి చాలు" అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ.

"కారులో పడుకోబెట్టి దాంతో సహా దహనం చేయాలనేది ఆమె ఆఖరికోర్కె, అందుకే కారుకూడా కొన్నాను" అంటూ చితి అంటించాడు రాజా.

చితి రగులుకుంటూ ఉండగా రాజా ముఖం ఎరుపెక్కింది. కళ్ళు క్రోధంతో ఎర్రబడ్డాయి "ఒరే, నా తల్లిని నాకు కాకుండా చేస్తావురా" అని అరిచాడు గట్టిగా.

వాడు తెల్లబోయి "నేనేంచేసాను బాబూ" అన్నాడు.

"నువ్వేరా నువ్వే, నా తల్లిని నానుంచి దూరం చేస్తున్న కిరాతకుడివి నువ్వే" అంటూ గట్టిగా రంకెవేసి జేబులోంచి పిస్టల్‌తీసి వాణ్ణి కసితీరా కాల్చిపడేసాడు.

అసుర సంధ్యవేళ. చీకట్లు ముసురుకుంటున్నాయి ఆ చీకట్లలో తూలుతుంటూ నడుస్తున్నాడు న్యూటన్ రాజా తల్లిపోయిన బాధ గుండెల్లో దిగమింగుకొని పుట్టెడు దుఃఖంతో అలానడుస్తూ వెళ్ళి చివరికి శూన్యంలో కలిసిపోయాడు. ❋